క్లుప్తంగా

భానుమతి శతజయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

విజయవాడ కల్చరల్: సినీనటి, దర్శకురాలు, నిర్మాత, సంగీత దర్శకురాలు భానుమతి శత జయంతి ఉత్సవాలను ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా నిర్వహించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో భానుమతి శత జయంతి వేడుకలను గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో స్వర్ణయుగం అని పిలుచుకునే కాలం భానుమతిదని పేర్కొన్నారు. దర్శకురాలుగా ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. తెలుగు సినిమా దిగ్గజాల శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తే సాంస్కృతి కళాసంస్థలు సహకరిస్తాయన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, డీ చంద్రశేఖర్, ప్రభల శ్రీనివాస్, శ్యాం ప్రసాద్, చిట్టిబ్బాయి పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల రక్తదానం



పెనమలూరు: సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. కాలేజీ విద్యార్థులు చిన్న అవుటపల్లిలో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీని సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలు, వివిధ విభాగాలపై అవగాహన చేసుకుని అనంతరం రక్తదానం చేశారు. దాదాపు 25 మంది విద్యార్థులు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ పి.సుష్మ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సంకీర్తన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం సాయంత్రం ముంబైకి చెందిన ఎస్.వరలక్ష్మి సంకీర్తనలను ఆలపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వరలక్ష్మి పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులు ఆమె గానానికి మంత్రముగ్ధులై కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారిణికి అమ్మవారి దర్శనం చేయించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

33 మంది మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులకు న్యాయస్థానం జరిమానా విధించింది. వివరాల ప్రకారం నాలుగో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 33 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి 6వ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లెనిన్‌బాబు ముందు హాజరుపర్చగా ఆయన జరిమానా విధించారు. వారిలో నలుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున, మరో 29 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

గాయనీ గాయకులు సాంస్కృతిక వారథులు



విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు సాంస్కృతిక వారథులని, వారికి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని అనిత ఆర్ట్స్ వ్యవస్థాపకుడు గొర్రెపాటి పవన్‌కుమార్ అన్నారు. అనిత ఆర్ట్స్ సినీ, లలిత సంగీత ఆవిర్భావ కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ ఔత్సాహిక గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనిత ఆర్ట్స్ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తామని ప్రకటించారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో తమ పేర్లు చిరస్థాయిగా నిలుపుకొన్న గాయనీ గాయకులను నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు, వివిధ రంగాలకు చెందిన ప్రదీప్‌కుమార్, వేమూరి వెంకటేశ్వరరావులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. గాయనీ గాయకులు మీనాకుమారి, గాయత్రి, ఉమ బలరాం, విజయ్‌కుమార్ తదితరులు పాట పాడుదాం పేరుతో పలు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు.

ఆప్కాస్‌కు మంగళం

తాడిగడప మున్సిపాలిటీలో మరో కొత్త దందా

- ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పగ్గాలు
- తక్కువ జీతాలకు 65 మంది కార్మికుల నియామకం
- కార్మికులకు అందని సమాన పనికి సమాన వేతనం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో మరో కొత్త దందాకు తెరలేపారు. ఈసారి ఏకంగా ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్(ఆప్కాస్)కు మంగళం పలికారు. కొత్తగా కాంట్రాక్టర్ వ్యవస్థను తీసుకువచ్చి 65 మంది పారిశుద్ధ్య కార్మికులను కనీస వేతనాలు ఇవ్వకుండా పనుల్లో నియమించారు. వివరాల్లోకి వెళితే... తాడిగడప మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్, నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులు 438 మంది ఉన్నారు. వీరిని ఆప్కాస్ కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆప్కాస్ అమలులోకి తీసుకువచ్చి కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేసింది. ఆప్కాస్‌లో కార్మికుల జీతాలు, ఉద్యోగ విరమణ, బెనిఫిట్స్, ఇతర చట్టాల పకడ్బందీగా అమలు జరుగుతున్నాయి. దీంతో కార్మికులు ఎవరి చేతుల్లో దగాకు గురికాకుండా సక్రమంగా జీతాలు తీసుకుంటున్నారు. సమాన పనికి సమాన వేతనం పొందుతున్నారు.



చెత్త ఎత్తుతున్న పారిశుద్ధ్య కార్మికులు

దళారుల కన్ను

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేద కార్మికుల జీతాలపై నేతలు, దళారులు కన్నేశారు. తాడిగడప మున్సిపాలిటీలో పని చేయటానికి పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉందని అదనంగా కార్మికులు కావాలని దందాకు స్కెచ్ వేశారు. పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్ కింద తీసుకోకుండా కాంట్రాక్టు విధానం తెరపైకి తీసుకు వచ్చారు. తాడిగడప మున్సిపాలిటీలో కౌన్సిల్ తీర్మానం చేసి, డైరెక్టర్ ఆండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో అనుమతులతో పారిశుద్ధ్యం నిర్వహణకు కాంట్రాక్ట్ పద్ధతిని అమలుకు టెండర్‌లు పిలిచారు. జూన్ నెలలో పారిశుద్ధ్య కాంట్రాక్టు టెండర్ పిలువగా ఇద్దరు వ్యక్తులు టెండర్‌లో పాల్గొన్నారు. తక్కువ టెండర్ వేసిన వ్యక్తికి ఈ నెల నుంచి పనులు అప్పగించారు. టెండర్లలో కాంట్రాక్టర్‌లు రింగ్ అయ్యారని, అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

దందా ఇలా...

కొత్త టెండర్ ప్రకారం కార్మికుడికి నెల జీతం కేవలం రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తారు. అయితే కాంట్రాక్టర్ 10 నెలలకు రూ.1.50 కోట్లకు టెండర్ ఖరారు చేశారు. 65 మంది కార్మికులకు నెలకు రూ.15 వేల చొప్పున కార్మికుల జీతాలు 10 నెలల్లో 97.50 లక్షలు అవుతుంది. మరి టెండర్ రూ.1.50 కోట్లకు పాడితే మిగతా రూ.అరకోటి సొమ్ము నేతలు, దళారుల జేబుల్లోకి వెళుతున్నాయా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఆప్కాస్ కింద పని చేస్తున్న కార్మికులకు నెల జీతం రూ.21 వేలు ఇస్తుంటే, కాంట్రాక్టర్ కింద పని చేసే కార్మికుడికి అదే పనికి కేవలం రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పారని కార్మికులు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అందడం లేదు. పైగా ఈఎస్ఐ, పీఎఫ్ కటింగ్‌లు పోతే చేతికి వచ్చేది రూ.12 వేలేనని కార్మికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించాల్సి ఉండగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు స్వయంగా రంగంలోకి దిగి కార్మికులను పనుల్లోకి తీసుకుంటున్నారు. కాంట్రాక్టర్‌కు ప్రయోజనం చేకూరటం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నానా తంటాలు పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క మున్సిపల్ కార్మికులు నెల జీతం రూ.26 వేలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు పద్ధతిలో పనులు చేస్తే కార్మికులకు రూ.15 వేలు జీతం ఇవ్వటం దారుణమని విమర్శలు వస్తున్నాయి.

అనుమతుల తోనే టెండర్లు

కాంట్రాక్టు పద్ధతిన కార్మికులను అనుమతులు తీసుకునే నియమించాం. గతంలో కౌన్సిల్ తీర్మానం చేశారు. జీతాల చెల్లింపు కాంట్రాక్టర్‌దే బాధ్యత.

–షేక్ నజీర్, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ



ఆప్కాస్‌లోకి మార్చాలి

ఆప్కాస్ ఉండగా ప్రైవేటు కాంట్రాక్టర్‌కు ఎలా అనుమతులు ఇచ్చారు? ఇంత కన్నా మోసం లేదు. కాంట్రాక్టర్ కింద పని చేసే కార్మికులను వెంటనే ఆప్కాస్‌లోకి మార్చాలి.

–షేక్ కాశిం, సీపీఎం మండల కార్యదర్శి

కేంద్ర పథకాలపై యువతకు అవగాహన ఉండాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన యువజన అధికారి సుంకర రాము తదితరులు

పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల యువతకు అవగాహన ఉండాలని కృష్ణాజిల్లా యువజన అధికారి సుంకర రాము అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ యువభారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతకు ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉంటే ప్రజల్లోకి తీసుకు వెళ్లి క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. దూరదర్శన్ రీజనల్ న్యూస్ హెడ్ షఫీ మొహమ్మద్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా భాగంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు రూపకల్పన చేసి అమలు చేస్తోందన్నారు. యూపీఐతో దేశంలో ఆర్థిక లావాదేవీలు సులభతరం అయ్యాయన్నారు. ఈ సందర్భంగా దేశంలో అమలు జరుగుతున్న వివిధ పథకాలు, బ్యాంకింగ్ సేవలపై పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, ఇండియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ విజయేంద్ర, వివిధ శాఖలకు చెందిన అధికారులు పి.ఉపేంద్రగౌడ్, కోలా వెంకటనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల పై అవగాహన పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

గిరిజన పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించండి



ఉయ్యూరులోని గిరిజన పాఠశాలలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

ఉయ్యూరు: గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి సూచించారు. ఉయ్యూరులోని ఏపీ గిరిజన సంక్షేమ వసతిగృహ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఆహార పదార్థాలను రుచి చూసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి బోధన, విద్యా ప్రమాణాలు, వసతులపై ఆరా తీశారు. గణితం, ఫిజిక్స్‌కు సంబంధించి ఉపాధ్యాయులు లేకపోవటాన్ని గుర్తించి ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను నియమించాలని సంబంధిత శాఖను ఆదేశించారు. రాజేంద్రనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మోహన్‌రావు, గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి, ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాఘవమ్మ పాల్గొన్నారు.

పతంజలి ఫుడ్స్‌లో మెగా రక్తదాన శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని పతంజలి ఫుడ్స్ పామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల రక్తమార్పిడి వైద్యం నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఫ్యాక్టరీ డీజీఎం కలపాల శ్రీనివాస్ సహా 80 మంది కార్మికులు రక్తదానం చేశారు. రక్తదాతలను పతంజలి ఫుడ్స్ జనరల్ మేనేజర్ టీవీ రమణ అభినందించారు.

ఆరోగ్య అవగాహనతో వ్యాధులు దూరం

సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు

గన్నవరంరూరల్: ఆరోగ్య అవగాహన ప్రజలను వ్యాధుల నుంచి దూరం చేస్తుందని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో జరుగుతున్న మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్ నాలుగవ రోజు 7వేల మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా అకాడమీ ప్రజల్లో ఆరోగ్య అవగాహన లక్ష్యంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత, మహిళలు, మేధావులు, సామాన్య ప్రజల్లో చైతన్యం తేవటం ఈ ఎగ్జిబిషన్ లక్ష్యమన్నారు.

డెంటల్ కాలేజీలో...

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో నాలుగవ రోజు ఎక్స్‌ప్లోర్-25 ఎగ్జిబిషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో కొనసాగింది. 9 విభాగాల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు సందర్శించారు. విద్యార్థుల సందేహాలను వైద్యులు నివృత్తి చేశారు. పెరియోడాంటిటిస్ విభాగంలో దంత పరిశుభ్రత, చిట్కాలను వివరించారు. హెచ్‌వోడీలు కాశేశ్వరరావు, అజయ్‌బెనర్జీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ఎగ్జిబిషన్‌లో ఆసక్తిగా వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

దేశంలో బీజేపీ బుల్డోజర్ పాలన

గన్నవరం: దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బుల్డోజర్ పరిపాలన సాగిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధ్వజమెత్తారు. స్థానిక ఎన్జీవోస్ భవనంలో గురువారం యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అప్రకటిత ఎమర్జెన్సీ నాడు-నేడుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ...దేశంలో ఎమర్జెన్సీ ప్రత్యక్షంగా విధించకుండానే ఎమర్జెన్సీ విధానాలను పరోక్షంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నాడు మీసా, నేడు ఉపా చట్టం కింద వేలాది మందిని విచారణ లేకుండానే జైళ్లలో పెడుతున్నారని చెప్పారు. భావ ప్రకటన స్వేచ్ఛను పూర్తిగా హరించేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలకు కూడా స్వేచ్ఛ లేకపోవడం దారుణమన్నారు. గోరక్షణ దళాల పేరుతో మైనార్టీలు, దళితులపై విస్తృతంగా దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దిగుమతులపై 50 శాతం సుంకాలు వేయడం వల్ల రొయ్యల పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి విపత్కర పరిస్థితులను మరెన్నో ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, కోశాధికారి మరీదు వరప్రసాద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు

పట్టించుకోని అధికారులు

కంకిపాడు: నిత్యం ట్రాఫిక్‌స్తంభించి పోతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ సమస్య నెలకొంటున్నా పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవటంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. వివరాల్లోకి వెళితే... కంకిపాడు పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలోని ఓ ఫంక్షన్ హాలు వద్ద తరచూ వివాహాది కార్యక్రమాలు, వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వేడుకలు నిర్వహించుకునే వారు ప్రధాన రహదారి ఇరువైపులా మార్జిన్‌లను పార్కింగ్‌గా అడ్డగోలుగా వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ అధికంగా ఉండే సమయంలో కంకిపాడు నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పర్యవేక్షించాల్సిన ఫంక్షన్ హాలు నిర్వాహకులు తమ బాధ్యతలను విస్మరించి గాలికొదిలేస్తున్నారు. దీనికి తోడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు కనీసం ఆ దరిదాపుల్లో కూడా ఉండటం లేదు. దీంతో పగలూ, రాత్రీ తేడా లేకుండా ఇక్కడ వేడుకలు జరిగే ప్రతి సారీ వాహనాలు స్తంభించిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కంకిపాడు స్టేట్ బ్యాంకు సమీపంలో కల్యాణ మండపం వద్ద నిలిచిన ట్రాఫిక్

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

గన్నవరం: గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ రవిబాబు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత విద్య, ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు దేవరపల్లి ఏసుబాబు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు నాగరాజు, మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు రవిబాబు

తల్లి పాలు బిడ్డకు హక్కు

పెనమలూరు: తల్లి పాలు బిడ్డకు పుట్టుకతో వచ్చిన హక్కని సీహెచ్‌వో ఎం.యామిని అన్నారు. వణుకూరు గ్రామంలో 3,5 అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం ప్రపంచ తల్లిపాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వాలన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగటానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. సచివాలయం 1 సీహెచ్‌వో పి.లక్ష్మీ సునీత మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ జీవితానికి కవచమన్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలే పునాది అని తెలిపారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వటం వలన రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు వై.రమా కుమారి, అబ్దుల్ సఫియా, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కాశేశ్వరిదేవి, పి.అనిత, కె.శిరీష, కె.శ్రీలేఖ, వీ.జ్యోతి, పి.రంగమ్మ, బసవకాంతమ్మ, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

యనమలకుదురులో...

యనమలకుదురులో జరిగిన తల్లిపాల వారోత్సవంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, తల్లులు క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.శైలజ, సీహెచ్.చంద్రావతి, బి.శాంతకుమారి, డి.జయశ్రీ, అన్నపూర్ణ, షేక్.రుక్సానా పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

రామవరప్పాడు: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జెడ్పీటీసీ సువర్ణరాజు అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ చాలా మంది తల్లులు అవగాహన లోపంతో బిడ్డలకు తల్లిపాలు పట్టించడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే న్యూట్రిషన్ ఫుడ్‌ను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఐటీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని అవగాహన పరిచారు. తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం తల్లులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అద్దేపల్లి సాంబశివనాగరాజు, పట్టపు చంటి, టాటా ట్రస్ట్ నుంచి కిన్నెర, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

కంకిపాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడులోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో కలిసి ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని భుజించటం ద్వారా ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్ సునీత, ఏఎన్ఎం శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.భవానీ, వై.నళినీకుమారి, బి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



వణుకూరులో మాట్లాడుతున్న సీహెచ్ఓ యామిని



తల్లులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, తల్లులు

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కారు విక్రయిస్తానని డబ్బులు తీసుకొని వ్యక్తిపై దాడి చేసిన ఘటన భవానీపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం ఓల్డ్ ఎంఐజీకి చెందిన షేక్ నాగూర్‌కు కనకదుర్గ గుడి వద్ద ఉన్న దర్గా వద్ద షంషూ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతని వద్ద ఉన్న స్కార్పియో కారును నాగూర్‌కు బేరం పెట్టాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నాగూర్ అతనికి రూ. 2.50 లక్షలు ఇచ్చాడు. కొద్ది రోజుల తర్వాత కారు రీమోడలింగ్ చేయాలని మరో రూ.లక్ష ఇవ్వాలని కోరాడు. అందుకు అంగీకరించిన నాగూర్ రూ.లక్ష ఇచ్చాడు. కానీ షంషూ కారు ఇవ్వడం లేదు. వేరే వ్యక్తికి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న నాగూర్ అతనికి ఫోన్ చేసి అడగగా సరైన సమాధానం చెప్పలేదు. ఈనెల 2న షంషూ భవానీపురంలోని నాగూర్ ఇంటికి వచ్చి గొడవ పడ్డాడు. అతనిపై దాడి చేశాడు. దీనిపై నాగూర్ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టెల్లా ఆధ్వర్యంలో ఫ్లాష్‌మాబ్



పీవీపీలో ఫ్లాష్‌మాబ్ చేస్తున్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జరుగుతున్న సంస్కృతిక భాషా వారోత్సవాల సందర్భంగా స్టెల్లా కళాశాల విద్యార్థినులు నగరంలోని లబ్బీపేటలో ఉన్న పీవీపీ మాల్‌లో కళాశాల సంస్కృత విభాగానికి పలువురు విద్యార్థినులు సంస్కృత గీతాలను ఆలపిస్తూ ఫ్లాష్‌మాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంస్కృతం అధ్యాపకులు డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ భాషా సాహిత్యంలో సంస్కృతానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రపంచంలోని మొదటి జ్యోతిష్య గ్రంథం, మొదటి నాట్య శాస్త్ర గ్రంథం, మొదటి వ్యాకరణ గ్రంథం సంస్కృత భాషలోనే ఉద్భవించాయన్నారు. ప్రపంచ విజ్ఞాన చరిత్రలో సంస్కృత భాషకు విశిష్టమైన స్థానం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ మాల్‌లో అందరినీ ఆకట్టుకుంది.

జీవనోపాధి నిమిత్తం కారు అందజేత



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మనకు ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేయడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందవచ్చునని మాజీ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలోని వైఎన్నార్ చారిటీస్ కార్యాలయంలో గన్నవరానికి చెందిన వి.రాఘవ దంపతుల జీవనోపాధి నిమిత్తం కారును గురువారం అందచేశారు. జెండాను ఊపి కారును ప్రారంభించిన తర్వాత ఇంతియాజ్ మాట్లాడుతూ.. తోటి వారికి సహాయం చేయాలంటే కేవలం నగదు మాత్రమే అవసరం లేదని, సహాయం చేసే వారి గురించి తెలియజేసినా వారికి సాయం చేసినట్టేనన్నారు. వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ మాట్లాడుతూ.. గన్నవరం నియోజకవర్గానికి చెందిన రాఘవ తనకు జీవనోపాధి కష్టంగా ఉందని, గతంలో కారు డ్రైవర్‌గా పని చేశానని చెప్పడంతో రాఘవకు జీవనోపాధి నిమిత్తం తమ చారిటీస్ తరపున డౌన్‌పేమెంట్‌ను చెల్లించి కారును రాఘవ దంపతులను అందజేశామన్నారు. చారిటీస్ సభ్యులు కొల్లి రవి, బి.కిషోర్, కొల్లి అజయ్, అనుముల పూర్ణ, అను, శివాజీ, వీరమాచినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.